పశు బీమా..లేదు ధీమా

- పశు బీమా పథకంపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం
- పథకం అమలు, అవగాహన కరువు
- మూడు నెలల నుంచి చెల్లించని ప్రీమియం
- ఇప్పటి వరకు బీమా ఊసెత్తని వైనం
- పశుపోషకులకు దక్కని భరోసా
- గత ప్రభుత్వంలో 'వైఎస్సార్ పశు బీమా' అమలు
- ప్రభుత్వమే 80 శాతం ప్రీమియం చెల్లింపు
- నియోజకవర్గంలో 2 వేల పశువులకు కూడా లేని బీమా


మేతకు వెళ్తున్న గేదెలు

బెల్లంకొండ: పాడి పరిశ్రమ వ్యవసాయ అనుబంధ రంగం. పశు పోషణపై ఆధారపడి రైతు కుటుంబాలు జీవిస్తుంటాయి. పాడి ఆర్థికంగానూ వెన్నుదన్నునిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో పాడి పశువులు, జీవాలు ప్రమాదవశాత్తూ మరణిస్తే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీని నుంచి పశు పోషకులను గట్టెక్కించడానికి పశు బీమా ఉపకరిస్తుంది. ఇందుకు కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశు బీమా పథకాన్ని అమలు చేస్తున్నాయి. కాగా, పశువు బీమా పథకం అమలుపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాలయాపన కలవరపరుస్తోంది. రైతుల పాలిట ఆపద్బాంధవుగా ఉండే పథకాన్ని నిర్లక్ష్యం చేస్తోంది.

బీమాపై నీలినీడలు..

గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు 80 శాతం, మిగిలిన వారికి 50 శాతం రాయితీతో పశు బీమా కల్పించారు. నిరంతరం పథకంపై అవగహన పెంచుతూ చర్యలు తీసుకున్నారు. పశు నష్టం వాటిల్లితే రైతులను ఆదుకునేందుకు 'వైఎస్సార్ పశు బీమా' పథకాన్ని సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బీమా పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత మూడు నెలల నుంచి బీమా ప్రీమియం నగదు విడుదలను నిలిపివేసింది. ఇప్పటి వరకూ పశు బీమా అమలు ఊసే ఎత్తలేదు. దీంతో పశుపోషకులకు భరోసా లేకుండా పోయింది.

బీమా పథకం వర్తింపు ఇలా

ఉత్పాదక దశలో ఉన్న 2–10 ఏళ్ల వయసులో ఉన్న ఆవులు, 3–12 ఏళ్ల వయసు గేదెలకు రూ.30,000, ఏడాదిన్నర వయసు ఉన్న మేలు జాతి ఎడ్లు, దున్నలకు రూ. 30,000 బీమా ఉంటుంది. రెండేళ్ల పైబడిన ఎడ్లు, దున్నలు, నాటు ఆవులకు రూ.15,000, ఆరు నెలల వయసు పైబడిన మేకలు, గొర్రెలు, పందులకు రూ.6,000 చొప్పున బీమా పథకం వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు వరదలు, తుఫానులు, పాము కాటు, అడవి జంతువుల దాడి, పిడుగుపాటు, అగ్నిప్రమాదం, రోడ్డు, రైలు ప్రమాదాలు, జబ్బుతో పశువులు మృత్యువాత పడితే బీమా పథకం వర్తిస్తుంది.

వీటికి బీమా వర్తించదు

పశువు యజమాని ఉద్దేశపూర్వకంగా హాని తలపెట్టినా, ఇతర బీమా ఏజెన్సీల్లో పశు బీమా చేయించినా, రాష్ట్ర జాతీయ విపత్తుల ప్రతి స్పందన నిధి పరిధిలోకి వచ్చే ప్రమాదాలకు బీమా వర్తించదు. పదేళ్ల వయసు దాటిన ఎడ్లు, దున్నలకు, ఆరు నెలల లోపు వయసు గొర్రెలు మేకలు పందులకు, శాశ్వత అంగవైకల్యం కలిగిన పశువులకు బీమా వర్తించదు.

పశువుల వివరాలు..

పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గేదెలు : 77,626 , ఆవులు : 20,335 , గొర్రెలు :76,827 , మేకలు : 42,019 ఉన్నాయి. కాగా, వీటిలో గత మూడు నెలల క్రితం 1,206 గేదెలు, 96 ఆవులు, 173 గొర్రెలు, 54 మేకలకు మాత్రమే బీమా చేయించినట్లు అధికారుల లెక్కలు చెప్తున్నాయి. మిగిలిన వాటికి బీమా చేయించలేదు.

అనుమతులు రావాల్సి ఉంది.

పశు బీమా పథకానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. పశు బీమా చేసేందుకు అనుమతులు రావాల్సి ఉంది. రెండు నెలలుగా సిబ్బంది పశువులకు టీకాలు వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన వెంటనే రైతులకు బీమా పథకంపై అవగహన కార్యక్రమాలు నిర్వహించి, వారి నుంచి బీమా ప్రీమియం కట్టించుకుంటాం.

– కె. కాంతారావు,
జిల్లా పశు సంవ శాఖాధికారి, పల్నాడు

లబ్ధిదారులు చెల్లించాల్సిన ప్రీమియం..

- ఆవు, గేదెలకు బీమా రూ.15 వేలకు రూ.960 ప్రీమియం ఉండగా, లబ్ధిదారులు రూ.192, ప్రభుత్వ రాయితీ రూ.768 చెల్లించాలి.
- రూ.30 వేలకు రూ.1,920 ఉండగా లబ్ధిదారులు రూ.384, ప్రభుత్వ రాయితీ రూ.1,536.
- మేకలు, గొర్రెలు, పందులకు ప్రీమియం రూ.180 ఉండగా, ప్రభుత్వ రాయితీ రూ.144 చెల్లించగా, రూ.36 చొప్పున ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు చెల్లించాలి.
- ఇతరులు ఆవులు, గేదెలకు రూ.15 వేలకు రూ.480, రూ.30 వేలకు రూ.960 లబ్ధిదారుని వాటాగా చెల్లిస్తే.. మిగిలిన 50 శాతం ప్రభుత్వమే ఇస్తుంది.

అన్ని కేటగిరీల రైతులు అర్హులే

పాడి పశువులు ఉన్న అందరూ రైతులు బీమా పొందినందుకు అర్హులే. అయితే దారిద్య్ర రేఖకు దిగువన, ఎగువన ఉన్న రైతులకు ప్రీమియంలో రాయితీ వర్తిస్తుంది. పాడి రైతులు బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్, రేషన్ కార్డును జత చేయాలి. బీమా చేసిన పశువుల చెవులకు ట్యాగ్‌ను గుచ్చుతారు. పశువులు ప్రమాదవ శాత్తు మరణించే సమయంలో ఈ ట్యాగ్ ఉండాలి. బీమా చేసిన పశువును ఇతరులు ఎవరైనా కొనుగోలు చేస్తే, వారి పేరిట మార్పు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.

క్లుప్తంగా

ఉచిత న్యాయ సలహా హెల్ప్‌లైన్ పోస్టర్ ఆవిష్కరణ



ముప్పాళ్ళ(సత్తెనపల్లి): ఉమ్మడి గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేర సత్తెనపల్లి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉచిత న్యాయ సలహా హెల్ప్‌లైన్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. పారా లీగల్ వలంటీర్లు హెల్ప్‌లైన్ స్టిక్కర్‌లను అతికించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయానికి 15100 ఉచిత కాల్ సెంటర్ పనిచేస్తుందని వారు తెలిపారు. ప్రజలకు అవగాహన కోసం ఆయా సెంటర్‌లలో స్టిక్కర్‌లు అతికించామని పారా లీగల్ వలంటీర్లు కోట బాబురావు, షేక్ సుబాని తెలిపారు.

సాయి బాబా మందిరానికి స్థలం విరాళం



క్రోసూరు: మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబా మందిరానికి దాతలు ఏడున్నర సెంట్ల స్థలాన్ని విరాళమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు వివరాలు వెల్లడించారు. క్రోసూరుకుకు గాదిరాజు రామమోహన్ రావు, జయలక్ష్మి, గాదిరాజు శేషగిరి రావు, గాదిరాజు నాగరాజు కుటుంబ సభ్యులు తమ స్థలాన్ని బాబా మందిరానికి ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాయి బాబాకు ప్రీతి పాత్రమైన గురువారం మందిరంలో 500 మందికి అన్నదానం చేశారు. దాతలను ఘనంగా సత్కరించారు. పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీ వరకు ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, సైడ్ డ్రెయిన్లను నిర్మిస్తున్నట్లు గ్రామ నాయకులు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ భూక్యా నాగమ్మ భాయి, మాజీ ఎంపీటీసీ మేకం భాస్కరరావు, నాయకులు అక్కల వెంకటరామిరెడ్డి, మేకం శ్రీరామమూర్తి, శ్రీను నాయక్, యలమందరావు పాల్గొన్నారు.

బ్యాటరీల దొంగలు అరెస్ట్

పెదకూరపాడు: వ్యసనాలకు బానిసలవుతున్న యువత టవర్‌ల బ్యాటరీల చోరీకి పాల్పడుతున్నారు. మండలంలోని జలాలపురం గ్రామంలో ఎయిర్‌టెల్ టవర్‌కు చెందిన 24 బ్యాటరీలు బుధవారం చోరికి గురైనట్లు సూపర్‌వైజర్ షేక్ బాజీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై గిరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. వ్యసనాలకు అలవాటు పడ్డ ముగ్గురు యువకులను 24 గంటల వ్యవధిలో గురువారం అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు పట్టణానికి చెందిన దడిగి మణికంఠ, పెదనందిపాడు మండలం పుసులూరు గ్రామానికి చెందిన బిల్లా వెంకటేష్, దక్కుమల్ల ధనరాజును అదుపులోకి తీసుకొని, సత్తెనపల్లి కోర్టులో హాజరపరిచారు. కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

పట్టభద్రుల ఓటు దరఖాస్తుకు అవకాశం

ముప్పాళ్ళ: గ్రాడ్యుయేట్ ఓటు హక్కు పొందేందుకు పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫాం–18 దరఖాస్తులు 114 అందాయన్నారు. ఓటు హక్కు కోసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లోను చేసుకోవచ్చని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలి

నరసరావుపేట: పట్టణంలోని హార్ట్ జూనియర్ కాలేజ్ కాంపౌండ్ 12 ఎకరాలు, ఏబీఎన్ వెస్ట్ కాంపౌండ్ 3.75 ఎకరాల ఆస్తిని కొంతమంది వ్యక్తులు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకొని చేస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని ప్రాపర్టీ కస్టోడియల్ కనుమూరు జయరాజ్ కోరారు. ఈ మేరకు గురువారం బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావుతో కలిసి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి విన్నవించారు. ఆయన వెంట తెలుగు బాప్టిస్ట్ పాస్టర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా 'పల్లె పండుగ'


గరికపాడులో పశువుల షెడ్డుకు భూమి పూజ

నకరికల్లు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. దేచవరం, రూపెనగుంట్ల, కండ్లకుంట, చీమలమర్రి గ్రామాల్లో పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాలు గురువారం నిర్వహించారు. రూపెనగుంటలో రూ.10 లక్షలు, దేచవరంలో రూ.10 లక్షలు, కండ్లకుంట గ్రామంలో రూ.8లక్షలు, చీమలమర్రి గ్రామలో రూ.8లక్షలతో అంతర్గత సీసీ రోడ్లకు, రూ.2లక్షలతో రెండు గోకులం షెడ్డుకు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో శంకుస్థాపనలు

రాజుపాలెం: మండలంలోని బీరవల్లిపాయ, బ్రాహ్మణపల్లి, కొత్తూరు, ఉప్పలపాడు గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాల్లో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. బీరవల్లిపాయలో సీసీ రోడ్డు, మినీ గోకులం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, సర్పంచ్ పసుపులేటి వెంకటస్వామి, టీడీపీ మండల కన్వీనర్ పల్లపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

దమ్మాలపాడులో పల్లె పండుగ

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం గురువారం జరిగింది. గ్రామంలో రూ. 13.5లక్షల అంతర్గత సీసీ డ్రెయిన్‌ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో పీజే విలియమ్స్, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ ఏడుకొండలు, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు శిరిగిరి వెంకట్రావు పాల్గొన్నారు.

గరికపాడు, నాగవరంలో పల్లె పండుగ

క్రోసూరు: మండలంలోని గరికపాడు, నాగవరం గ్రామాల్లో గురువారం పల్లె పడుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. పశుపోషకులు గంగనపల్లి సైదమ్మ, తోకల పద్మావతి ఇళ్ల వద్ద పశువుల షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గరికపాడు సర్పంచ్ శీతారామాంజనేయులు, పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు, ఉపాధి హామీ ఏపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సాంబరెడ్డి, పశు వైద్యులు డాక్టర్ మల్లయ్య, అంగన్‌వాడీ వర్కర్లు, నాగవరంలో సర్పంచ్ చిరంజీవి, వై.రామాంజనేయులు, ఉపాధిహామీ సిబ్బంది, పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


వాల్మీకి మహర్షి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): వాల్మీకి మహర్షి జయంతిని సాంస్కృతి ఉత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో గురువారం జరిగిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని లోకానికి చాటిన మహా పురుషుని జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొర్రా వెంకట అప్పారావు, టీడీపీ నాయకులు రామస్వామి, ఎద్దులదొడ్డి శ్రీనివాసరావు, చౌటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజుపాలెం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్ర పటానికి తహసీల్దారు గుర్గేష్‌రావు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు జానీ బాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల కంటి చూపుపై శ్రద్ధ చూపాలి

కంటి వైద్యుడు డాక్టర్ చెంచురెడ్డి


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

నరసరావుపేట ఈస్ట్: చిన్నారుల కంటిచూపు పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మాక్స్‌విజన్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ చెంచురెడ్డి తెలిపారు. మాక్స్‌విజన్ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం కే-రిడ్జి స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ చెంచురెడ్డి మాట్లాడుతూ, సెల్‌ఫోన్, టి.విలను ఎక్కువగా చూడటంతో పాటు వాటి నుంచి వచ్చే రేడియేషన్ కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. చిన్నారులు తరచూ తలనొప్పికి గురికావటం, కనుల వెంట నీరు కారటం వంటి పరిస్థితులను గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో విద్యార్థులను పరీక్షించి తగిన వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, అకడమిక్ కోఆర్డినేటర్ హేమంత్, ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీ తప్పనిసరి

బొల్లాపల్లి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వెలుగు పథకం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా స్త్రీనిధి ఏజీఎం ఆర్. చిన్నబుల్లెయ్య మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు నూరు శాతం రికవరీ చేయాలన్నారు. రుణాలు చెల్లించిన సంఘాలకు తిరిగి రుణాలు అందజేస్తామన్నారు. మండలంలో స్త్రీనిధి రుణాలు రూ.43.70లక్షల బకాయిలు పేరుకుపోయాయని, స్త్రీనిధి బకాయిలపై రికవరీ గురించి సిబ్బంది దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రంగారెడ్డి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపిక



పెదకూరపాడు: గుంటూరు జిల్లాలోని చేబ్రోలు మండలం వేజండ్లలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఎంపికల్లో పెదకూరపాడుకు చెందిన జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. నలుగురు బాలురు, ఇద్దరు బాలికలు రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. క్రీడలకు ప్రాధాన్యమిచ్చి విద్యార్థులను ప్రోత్సహించడంపై డైరెక్టర్ గుత్తా రాముని, కోచ్‌ని, విద్యార్థులను, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుల అభినందించారు. విద్యార్థులను కరస్పాండెంట్ గుత్తా కవిత రాము, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నరసరావుపేట రూరల్: ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మద్యానికి బానిసైన మండలంలోని పెదరెడ్డిపాలెంకు చెందిన మార్పుల లక్ష్మయ్య (29) వారం రోజుల క్రితం పురుగుమందు సేవించి ఇంటి వద్ద ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు అతడిని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. దీనిపై రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ కిషోర్ తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు



శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు పారదర్శకంగా అందించాలని డీఎంహెచ్‌వో బి.రవి అన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రవి మాట్లాడుతూ గర్భిణులు నమోదు పురోగతి వేగవంతమయ్యేలా వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. మండల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మాణ్యం రాధాకృష్ణన్ ,సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్స్ సతీష్, సీతారామిరెడ్డి, ఫార్మాసిస్ట్ లక్ష్మీ నారాయణ ఉన్నారు.

ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోండి

బొల్లాపల్లి : ఉపాధి హామీ పథకంలో సీసీ రోడ్లు, సైడ్ కాలువలకు విడుదలైన నిధులను సద్వినియోగపరచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీ బాషా తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా వడ్డెం గుంట, కనుమల చెరువు గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల వంతున ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. ఏపీవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌యూసీసీ సభ్యుడిగా చల్లంచర్ల



ముప్పాళ్ళ(సత్తెనపల్లి): డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు, మున్సిపల్ చైర్మన్ భర్త చల్లంచర్ల సాంబశివరావు నియమితులయ్యారు. రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.కమాలకరబాబు ద్వారా నియామక పత్రాన్ని గురువారం అందుకున్నారు. గుంటూరు డివిజన్ కోసం డివిజనల్ రైల్వే వినియోగదారుల కన్సల్టేటివ్(డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా 2026 ఆగస్టు 15 వరకు సభ్యుడిగా పనిచేయనున్నారు. ఈ సందర్భంగా చల్లంచర్ల సాంబశివరావును చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

విద్యార్థినులకు అభినందన



ముప్పాళ్ళ(సత్తెనపల్లి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి అండర్–14 బాడ్మింటన్ విభాగంలో పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల బాధ్యులు సిస్టర్ విజయరాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.అచ్చిరెడ్డి గురువారం తెలిపారు. క్రీడాకారిణులు గుంజి బాల సమీక్ష, ముళ్ళమూరి ఐశ్వర్యను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

సెక్యూరిటీ ఉన్నా.. సేఫ్టీ సున్నా


సీహెచ్‌సీ అద్దాలు పగలగొట్టిన ఆకతాయిలు



స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రక్షణ కరువైంది. సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా భద్రత లేకుండా పోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.8.5 కోట్లతో నూతన సీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. 2023 మార్చిలో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నూతన వైద్యశాలను ప్రారంభించారు. కానీ, ఇప్పటికీ ఆసుపత్రిలో వసతులు లేమి పేరుతో పాత వైద్యశాలలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వైద్యశాల చీకటి పడితే మందు బాబులకు అడ్డగా మారుతోంది. మద్యం మత్తులో ఆకతాయిలు వైద్యశాల అద్దాలు, గోడలు ధ్వంసం చేస్తున్నారు. ఇక నూతన మద్యం విధానంతో వీరి ఆగడాలకు అడ్డే లేకుండా పోయే ప్రమాదం ఉంది. సెక్యూరిటీ సిబ్బంది తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారు. వైద్యశాల ఊరి చివరిలో ఉండటంతో ఇలాంటి ఘటనలు అడ్డుకట్ట పడటం లేదు. వీటన్నిటికీ చెక్ పెట్టాలంటే వెంటనే వైద్యశాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– పెదకూరపాడు

చేతుల పరిశుభ్రత తప్పనిసరి


చేతుల పరిశుభ్రత గురించి వివరిస్తున్న శిఖా శ్యాంసన్

దొడ్లేరు(క్రోసూరు): చేతులు శుభ్రంగా కడుక్కోవడం ఒక ఆరోగ్యకరమైన పద్ధతి అని, మంచి ఆరోగ్యాన్ని పొందటంలో చేతుల పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని దొడ్లేరు సచివాలయం–1లో చేతుల పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి మాట్లాడుతూ 90 శాతం వ్యాధులను నివారించడానికి చేతులు పరిశుభ్రత ముఖ్యమన్నారు. కాలకృత్యాలు తీర్చిన ప్రతీసారి, వంట చేయటానికి ముందు, ఆహారం తినడానికి ముందు ఇలా అన్ని సందర్భాల్లో చేతులను బాగా సబ్బుతో శుభ్రపరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ధన రేఖ చేతులను శుభ్రపరుచుకునే విధానం చేసి, చూపించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు త్రివేణి, పార్వతి పాల్గొన్నారు.

జాన్ డేవిడ్ సేవలు ఆదర్శనీయం



చిలకలూరిపేట: డాక్టర్ జాన్‌డేవిడ్ సేవలు ఆదర్శనీయమైనవని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, ఫార్‌కార్నర్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జెస్సీ ఎస్ బర్నబాస్ చెప్పారు. ఏఎంజీ, ఫార్‌కార్నర్స్, వేద స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ జాన్‌డేవిడ్ జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఆయా సంస్థలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు జాన్‌డేవిడ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న జాన్‌డేవిడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద వర్గాలకు చెందిన పిల్లలు ఉన్నతస్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో విద్యాసంస్థలు స్థాపించి వేలాది మంది విద్యార్థులకు వసతితో కూడిన ఉచిత విద్యను అందించారని కొనియాడారు. అనంతరం గుండయ్య తోటలోని నిరీక్షణ ప్రార్థనా మందిరం, ఏఎంజీ ప్రాంగణాల్లో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్ సులక్షన్, సాంబయ్య, మోజెస్, పీటర్, ప్రసన్న, సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.